క్లుప్తంగా

హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ


హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

కపిలేశ్వరపురం: స్థానిక గోదావరి గట్టు వద్ద రేకులతో నిర్మించిన హోటల్‌పైకి ధాన్యం లోడు లారీ దూసుకెళ్లింది. ప్రమాదవశాత్తూ బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన జరిగిన సమయంలో హోటల్‌లో నిర్వాహకులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హోటల్ రేకుల షెడ్డు, సామగ్రి ధ్వంసమయ్యాయి. తాడేపల్లిగూడెం నుంచి కె.గంగవరం ఏటిగట్టు మీదుగా వెళ్తుండగా వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అంగర పోలీసులు తెలిపారు.

నేడు బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూ

రామచంద్రపురం: పురపాలక సంఘం పరిధిలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలను వివిధ బ్యాంకు మేనేజర్లతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దరఖాస్తుదారులు పాస్ పోర్టు సైజు ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం జెరాక్స్ కాపీలు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కమిషనర్ తెలిపారు.

కార్మికులకు సోలార్ యూనిట్ల పంపిణీ

రామచంద్రపురం రూరల్: ఆదివారపుపేటలో శివ బాలయోగి మహారాజ్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో 25 మంది చేనేత కార్మికులకు సోలార్ యూనిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా మంజూరైన ఈ యూనిట్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం ద్వారా లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఈ సోలార్ యూనిట్ల ద్వారా విద్యుత్ అంతరాయం ఏర్పడిన సమయంలో కూడా నేత పనికి ఇబ్బంది ఉండదని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ నక్కిన దొరబాబు, మంత్రాల గురువు కలకండ రామలింగేశ్వరరావు, గ్రామ పెద్దలు కొండా పూర్ణచంద్రరావు, అల్లక రాజు, అల్లక వీవీ సత్యనారాయణమూర్తి, సొసైటీ కార్యదర్శి నక్కిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు


కపిలేశ్వరపురంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రత్నకుమారి

కపిలేశ్వరపురం: బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు గురువారం కపిలేశ్వరపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది దరఖాస్తులను పరిశీలించారు. బీసీ ఎ, బి, సి, డి, ఇ సామాజిక వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఆర్య వైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ సామాజిక వర్గీయులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నారు. 653 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 402 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. సంబంధిత వాణిజ్య బ్యాంకుల మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను పరిశీలించారు.

7న బార్ అసోసియేషన్ ఎన్నికలు

రామచంద్రపురం: స్థానిక బార్ అసోసియేషన్‌కు ఈనెల 7వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి టి.చలపతి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ జరుగుతుందని, అనంతరం అదే రోజున కౌంటింగ్ కూడా ఉంటుందన్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, స్పోర్ట్స్, కల్చరల్ పదవులకు ఇద్దరు చొప్పున ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయడంతో వారి మధ్య పోటీ నెలకుందని, దీంతో ఎన్నికల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళా న్యాయవాదుల ప్రతినిధిగా లగాని కమల కుమారి ఒకరే నామినేషన్ వేయడంతో ఆమె ఏకగ్రమయ్యారని చెప్పారు. ఎన్నికలు శాంతియుతంగా జరిపించాలని ఆయన న్యాయవాదులను కోరారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా బండి శ్రీనివాస్, కుడిపూడి కిరణ్‌శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారు.

పదిలమైన ఫలితాలకు నిరీక్షణ

- ముగిసిన టెన్త్ పరీక్షలు
- ఫలితాల కోసం ఆశగా ఎదురు చూస్తున్న విద్యార్థులు
- మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో గతేడాది మెరుగైన ఫలితాలు


అంగరలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

కపిలేశ్వరపురం: పదో తరగతి పరీక్షలు ముగిశాయి. మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులు గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నారు. మార్చి 17 నుంచి 31 వరకూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాశారు. పాఠశాల విద్యను ముగించుకుని ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలన్న ఆశతో బాల, బాలికలున్నారు. విద్యార్థుల బంగారు భవితకు ప్రామాణికం కానున్న పరీక్ష ఫలితాలపై విద్యార్థులు అంచనాలు వేసుకుంటున్నారు. మూల్యాంకనం ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఫలితాలు కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో విద్యార్థులు 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో మెరుగైన ఫలితాలను సాధించారు. గత ఫలితాలను సమీక్షిస్తూ ఈ కథనం...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తమ ఫలితాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యాబోధన, పాఠ్య పుస్తకాలు రూపకల్పన తదితర అంశాల్లో శాస్త్రీయమైన పద్ధతులను అమలు చేసింది. ఆ ప్రభుత్వ శ్రమ ఫలితం పేద, మధ్య తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను ప్రతిబింబించింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పదో తరగతి విద్యార్థులు ఏటా పెరుగుతూ మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు. 2022–23 విద్యాసంవత్సరంతో పోల్చి చూడగా 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు.

రెండు నియోజకవర్గాల్లో ఈ ఏడాదిలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	గైర్హాజరు
రామచంద్రపురం	33	1,629	01
కె.గంగవరం	10	453	--
కాజులూరు	17	594	--
మండపేట	28	1,778	05
రాయవరం	13	696	07
కపిలేశ్వరపురం	11	470	01
మొత్తం	112	5,620	14

రామచంద్రపురం నియోజకవర్గంలో..

రామచంద్రపురం పట్టణంలోని 7 పాఠశాలలకు గానూ 2022–23లో 400 మంది పరీక్షలు రాయగా 228 మంది ఉత్తీర్ణులవ్వడంతో 57 శాతం నమోదైంది. 2023–24లో 391 కి 314 ఉత్తీర్ణులై 81 శాతం నమోదైంది. రామచంద్రపురం రూరల్ మండలంలోని ఎనిమిది పాఠశాలలకు గానూ 2022–23లో 502 మందికి 248 ఉత్తీర్ణులు కావడంతో 50 శాతం నమోదుకాగా 2023–24లో 533 కి 450 మంది ఉత్తీర్ణులై 85 శాతం నమోదైంది. కాజులూరు మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2022–23లో 605 మందికి 431 మంది ఉత్తీర్ణులై 72 శాతం నమోదుకాగా 2023–24లో 95 శాతం నమోదైంది. కె.గంగవరం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 2022–23లో 62 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు కాగా 2023–24లో 450 మందికి 418 మంది ఉత్తీర్ణులై 93 శాతం నమోదైంది.

మండపేట నియోజకవర్గంలో..

2022–23 విద్యా సంవత్సరం ఫలితాల్లో మండపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,130 మంది పరీక్షలు రాయగా వారిలో 1,510 మంది ఉత్తీర్ణులు కావడంతో 71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023–24లో 2,095 మందికి 1,806 మంది ఉత్తీర్ణులు కావడంతో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండపేట మండలం ప్రభుత్వ పాఠశాలల నుంచి 2022–23లో 1,015 మంది పరీక్షలు రాయగా 673 మంది ఉత్తీర్ణులై 67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023–24లో 1,008 మంది పరీక్షలు రాయగా 817 మంది ఉత్తీర్ణులయ్యారు. 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాయవరం మండలంలో 2022–23లో 642 మందికి 462 మంది ఉత్తీర్ణులై 71 శాతం నమోదైంది. 2023–24లో 700 మంది పరీక్షలు రాయగా 614 మంది ఉత్తీర్ణులవ్వడంతో 88 శాతం నమోదైంది. కపిలేశ్వరపురం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 2022–23లో 473 మంది విద్యార్థులు హాజరు కాగా 349 మంది ఉత్తీర్ణులై 74 శాతం నమోదైంది. 2023–24లో 387 మందికి 375 మంది ఉత్తీర్ణత సాధించడంతో 97 శాతానికి ఉత్తీర్ణత శాతం పెరిగింది.

మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం



కపిలేశ్వరపురం మండలంలో 470 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. విద్యా సంవత్సరమంతా ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంతో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. విద్యాశాఖాధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషికి మంచి ఫలితం దక్కుతుందన్న నమ్మకం ఉంది.

– కె.తాతారావు, ఎంఈఓ, కపిలేశ్వరపురం

ప్రభుత్వ పాఠశాలల వారీగా పెరుగుదల ఇలా...

2022–23 విద్యా సంవత్సరంలో 83 శాతం ఫలితాన్ని సాధించిన అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల 2023–24లో నూరుశాతం ఫలితాలను సాధించింది. 2022–23 విద్యా సంవత్సరంలో టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల నూరుశాతం ఫలితాలను సాధించింది. వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాల 2022–23లో 83 శాతం సాధించగా 2023–24లో 96 శాతం ఫలితాన్ని సాధించింది. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 76 శాతం నుంచి 95 శాతానికి, మాచర 67 శాతం నుంచి 97 శాతానికి, నల్లూరు 66 శాతం నుంచి 93 శాతానికి, కపిలేశ్వరపురం 65 శాతం నుంచి 96 శాతానికి, కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల 64 నుంచి 96 శాతానికి ఉత్తీర్ణత శాతం పెరిగింది.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన


పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ శాంతలక్ష్మి

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్నత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సరై పద్ధతిలో సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డీపీఓ శాంతలక్ష్మి అన్నారు. దంగేరు గ్రామంలో పంచాయతీతోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, చెత్తను ఎరువుగా మార్చాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయు విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఈఓపీఆర్డీ గౌరికుమారి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ స్పెషల్ డ్రైవ్


తోటపేటలో స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న వెంకన్నబాబు, హెచ్‌ఎం శ్రీనివాస్‌లు

రామచంద్రపురం రూరల్: రానున్న విద్యా సంవత్సరంలో తమ చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ అధ్యక్షుడు, సీఆర్పీ సీహెచ్ వెంకన్నబాబు గురువారం మండలంలోని భీమక్రోసుపాలెం, తోటపేట గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో భీమక్రోసుపాలెం సర్పంచ్ పలివెల లోవరాజు, ఎంపీటీసీ యెన్నం దేవి, తోటపేట ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఈసీజీ మెషీన్ అందజేత


అంగర పీహెచ్‌సీలో రోగికి మెషీన్‌తో ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పీహెచ్‌సీకి గ్రామానికి చెందిన సంకాబత్తుల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన మనుమడు బిరద సూర్య ప్రకాష్ ఈసీజీ మెషీన్‌ను సమకూర్చారు. ఈ యంత్రాన్ని గురువారం ఆసుపత్రి వైద్యాధికారి పి.రత్నకుమారికి అందజేశారు. అంగర, పడమరఖండ్రిక గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దల సమక్షంలో రాగం రామచంద్రరావు చేతులు మీదుగా ఈసీజీ మెషీన్‌ను ప్రారంభించారు. ఇరు గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పెద్దిరెడ్డి శేషారత్నం, మాజీ సర్పంచ్‌లు సంకాబత్తుల స్వామికాపు, కొండేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక స్పృహతో ఆసుపత్రి అభ్యున్నతికి కృషి చేస్తున్న సూర్యప్రకాష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, మాజీ కొండేటి నాగేశ్వరరావు, నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, పుచ్చల శ్రీనివాసు, పిల్లాబసవరాజు పాల్గొన్నారు.

ఆస్తి మూరెడు.. ఆశ బారెడు!


కొత్త సినిమా టిక్కెట్ల కోసం అన్నట్లుగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్పొరేషన్ రుణాల ఆశావాహులు


రామచంద్రపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్పొరేషన్ రుణాల ఆశావాహులు

రామచంద్రపురం రూరల్: ఆస్తి మూరెడు..ఆశ బారెడు అన్న చందంగా ఉంది వివిధ కార్పొరేషన్‌ల రుణాల ఆశావహుల పరిస్థితి. రామచంద్రపురం మండలంలో కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని పిలుపు ఇచ్చిందే తడవుగా 2,404 మంది దరఖాస్తు చేసుకున్నారు. తీరా ప్రభుత్వం కేవలం 74 మందికి మాత్రమే రుణాలు ఇవ్వడానికి సిద్ధమైంది. దీనిలో కాపు కార్పొరేషన్ నుంచి 23 మందికి, బీసీ కార్పొరేషన్ నుంచి 47 మందికి, జనరిక్ మెడికల్ షాపు బీసీ ఏ వారికి ఒకరికి, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో కమ్మ ఒకరికి, బ్రాహ్మణ ఒకరికి, వైశ్య నుంచి ఒకరికి మాత్రమే రుణాలు మంజూరు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొనగా కాపులు 1358 మంది, బీసీలు 953 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 93 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గురువారం రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో కాపులు 782 మంది, బీసీలు 565 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 50 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. వారికి ఆయా బ్యాంకుల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ ఎస్.సెలత్‌రాజు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం


పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు

రాయవరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి మండల పాస్టర్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. రాయవరంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జె.సాల్మన్‌రాజు అధ్యక్షతన గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు ఎం.ప్రభావ్‌కుమార్, వి.శామ్యూల్‌రాజు, ఎం.విలియం కేరి, బి.చార్లెస్ తదితరులు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయపరమైన విచారణ చేపట్టాలన్నారు. ప్రవీణ్ పగడాల మృతికి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ నాయకులు పీపీ ప్రాయిస్, సీహెచ్ విల్లింగ్‌స్టన్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


సదస్సులో మాట్లాడుతున్న మండల తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్

కాజులూరు: రీ సర్వేకు వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది సత్వరమే పరిష్కరించాలని మండల తహసీల్దార్ జి.రవీంద్రనాథ్‌ఠాగూర్ అన్నారు. కోలంకలో గురువారం జరిగిన రీ సర్వే గుర్తింపు కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొని సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 100 సంవత్సరాల క్రితం రాష్ట్రంలో శాశ్వత భూ సర్వే జరిగిందని, అప్పటి నుంచి పూర్తి స్థాయిలో సర్వే లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వీర్వోలు సుబ్రహ్మణ్యం, ధరణి, శ్రీనివాస్, లోవరాజు, పలు గ్రామాల వీఆర్‌ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం రాజ్యాంగానికి విరుద్ధం


మీడియాతో మాట్లాడుతున్న అలీఖన్‌బాబా

మండపేట: వక్ఫ్ బోర్డుపై కేంద్రం తీసుకొచ్చిన చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు చంద్రబాబు మద్దతివ్వడంతో తన అసలు రూపం బయట పడిందన్నారు. ముస్లింలపై ఆయనకు ఏపాటి అభిమానం ఉందో అర్థమవుతోందన్నారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బిల్లుపై ఆయన నిరసన తెలిపారు. ఇతరులకు వక్ఫ్ బోర్డులో అవకాశం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ముస్లింల ద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు. టీడీపీలో ఉండే ముస్లిం నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు నిజ స్వరూపం తెలుసుకోవాలన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ముస్లిం కోసం రిజర్వేషన్లు చేశారని కొనియాడారు. తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనారిటీ సంక్షేమానికి రూ.26 వేల కోట్లు వెచ్చించి ముస్లింలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ బిల్లును తమ పార్టీ జాయింట్ పార్లమెంటరీ కమిటీలో వ్యతిరేకించిందన్నారు. ఈ బిల్లు ఆర్టికల్స్ 14, 15 ,25, 26లో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలు ఎన్డీఏ కూటమి పార్టీలకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కామేశ్వర శర్మకు ప్రశంసాపత్రం



నిర్వాహకులు చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న కామేశ్వర శర్మ

అయినవిల్లి: వీరవల్లిపాలెం భద్రకాళి సమేత వీరేశ్వర స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వెలువలపల్లి కామేశ్వర శర్మకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శైవాగమ పండిత ప్రశంసా పత్రం అందుకున్నారు. గత 21 రోజులుగా జరుగుతున్న ఆన్‌లైన్ క్లాసులలో వేదిక్ యూనివర్సిటీ ద్వారా శైవాగమ, వైఖానస, పంచరాత్ర ఆగమ శాస్త్ర విభాగాల్లో నిర్వహించారు. ఈ క్లాసుల్లో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన వారికి తిరుపతిలో వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ×ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రంతో పాటు గుర్తింపు పత్రాలను అందించారు. ఇందులో భాగంగా ఉత్తీర్ణత సాధించిన వెలవలపల్లి కామేశ్వరశర్మకు శైవాగమ శాస్త్ర సారావళి జ్ఞాన పాదం విభాగంలో ప్రశంసాపత్రం, గుర్తింపు పత్రం లభించింది. కామేశ్వరశర్మను తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమన ఆస్థాన పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షిత అవధానులు అభినందించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రాయవరం: మండలంలోని వెదురుపాక జనార్దనస్వామి ఆలయంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాపు ఐక్య సంఘం నాయకులు గురువారం విలేకరులకు తెలిపారు. కాకినాడకు చెందిన వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వెదురుపాక, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాపు ఐక్య సంఘం నేతలు పిలుపునిచ్చారు.

స్కూల్ ఆటోల తనిఖీ


స్కూల్ ఆటో రికార్డులు తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

కొత్తపేట: స్థానిక పరిసర ప్రాంతాల్లో స్కూల్ పిల్లలను తీసుకు వెళ్లే ఆటో రిక్షాలను గురువారం రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసి నాలుగు ఆటోలపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, స్కూల్ విద్యార్థులను తీసుకునివేళ్లే ఆటో రిక్షాలు, వాహనాలు రహదారి భద్రతా నియమాలు, నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని శ్రీనివాసరావు హెచ్చరించారు. రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని తల్లిదండ్రులు, స్కూల్స్ యాజమాన్యం కూడా బాధ్యత వహించాలని తెలిపారు. త్వరలోనే రహదారి భద్రతపై విద్యార్థులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి మృతి


రామచంద్రపురం వై.జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

రామచంద్రపురం: స్థానిక బైపాస్ రోడ్డులో పసలపూడి వై.జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన యువకుడు వీరి సాయి వెంకటకృష్ణ(20) అక్కడికక్కడే మృతి చెందినట్లు రామచంద్రపురం ఎస్సై సీహెచ్ సారథిబాబు గురువారం విలేకరులకు తెలిపారు. మృతుడు సాయి వెంకట కృష్ణ మరొక వ్యక్తి దాసరి శ్రీనుతో కలసి కాకినాడ నుంచి స్వగ్రామం గంటి పెదపూడి వెళుతుండగా పసలపూడి వై.జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన దాసరి శ్రీను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సారథిబాబు తెలిపారు.

యూటీఎఫ్ సేవలు అభినందనీయం

ఆలమూరు: ఉపాధ్యాయులకు, కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని నర్సిపూడిలోనున్న జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆనందరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్న లక్ష్యం మేరకు యూటీఎఫ్ శాఖ సమకూర్చిన రూ.మూడు లక్షలను మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, ఈదల సత్తిబాబు, దున్నే స్వామినాయుడు, రాయుడు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.